క్లుప్తంగా

రక్షిత మంచినీటి పథకానికి మరమ్మతులు

సీతంపేట: మండల కేంద్రంలోని ఎస్టీ న్యూకాలనీ చివరన ఉన్న రక్షిత మంచినీటి పథకానికి మరమ్మతులు చేపడుతున్నామని సర్పంచ్ ఆరిక కళావతి, పంచాయతీ సెక్రటరీ రామకృష్ణ తెలిపారు. ఈమేరకు మరమ్మతులను బుధవారం పరిశీలించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా పది రోజుల పాటు వంశధార డైరెక్ట్ పంపింగ్ ద్వారా తాగునీరు అందిస్తామని చెప్పారు.

విద్యా సామర్థ్యాలను తెలుసుకునేందుకే..



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

వీరఘట్టం: ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకునేందుకే పరాక్ రాష్ట్రీయ సర్వేక్షణ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ ఆర్.ఆనందరావు అన్నారు. మండల కేంద్రంలోని మహర్షి హైస్కూల్‌తో పాటు ఎస్.గోపాలపురంలోని మౌంట్‌ఫోర్డ్ పాఠశాలలో 3, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు, గణితం, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులపై బుధవారం పరీక్షలు నిర్వహించారు.

చేప పిల్లల విడుదల



చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

భామిని: శాఖాపరంగా రాయితీపై అందిస్తున్న చేప పిల్లలను సంరక్షించుకుని పెంపకందారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పాలీస్‌కోట సర్పంచ్ బిడ్డిక ఆదినారాయణ అన్నారు. మండల పరిధిలోని బురుజోలు, కొత్తగూడ, మంద్రంగూడ, జక్కరగూడ, తదితర గ్రామాలకు సంబంధించిన 12 చెరువుల్లో 40 వేల పైచిలుకు చేప పిల్లలను బుధవారం విడుదల చేశారు. కార్యక్రమంలో మాచర్ల ఆఫీసు, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఫ్రెషర్స్ డే



అలరించిన విద్యార్థినుల నృత్యాలు

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర పరిధిలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్‌డే వేడుకలను నిర్వహించి నూతన విద్యార్థులకు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్.రాజ్యలక్ష్మి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పెదమేరంగి సచివాలయం సందర్శన



పెదమేరంగిలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి సచివాలయాన్ని ఎంపీడీఓ ఎస్.రమేష్ బుధవారం సందర్శించారు. 919 హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేయాల్సి ఉండగా 879 చేసారని, మిగిలిన 40 ఎప్పుడు చేస్తారని సిబ్బందిని ప్రశ్నించారు. చినమేరంగి సచివాలయంలో హాజరును పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు.

వసతి లేని శిక్షణతో అభ్యర్థుల అవస్థలు

పార్వతీపురం టౌన్: వసతి సౌకర్యం లేకుండా గిరిజనులకు ఇస్తున్న ఉచిత డీఎస్సీ శిక్షణ వల్ల గిరిజన అభ్యర్థు అవస్థలు పడుతున్నారని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ శిక్షణలో కేవలం మధ్యాహ్నం భోజనం మాత్రమే పెట్టి వసతి సౌకర్యం లేకుండా గిరిజన ప్రాంత అభ్యర్థులు రాకపోకలు చేసి డీఎస్సీ పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కాగలరని ఆయన ప్రశ్నించారు. ప్రయాణానికే నాలుగు గంటలు పడుతుందని చెప్పారు. వసతి సౌకర్యంతో కూడిన శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేసారు. కేవలం ఎస్‌జీటీలకు మాత్రమే శిక్షణ ఇస్తున్నారని మరి పాఠశాల సహాయకులు, బాషా పండితుల పోస్టులకు పోటీ పడే అభ్యర్థుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.



క్షణ క్షణం.. భయం భయం..



ప్రధాన ద్వారం వద్ద కూలుతున్న పైకప్పు (ఇన్‌సెట్లో) బ్రిటీష్ కాలం నాటి పాలకొండ తహసీల్దార్ కార్యాలయం

- బ్రిటీష్ కాలంనాటి భవనం
- శిథిలావస్థకు చేరుకున్న తహసీల్దార్ కార్యాలయం
- బిక్కుబిక్కుమంటూ విధులు
- వర్షం పడితే చిత్తడే..

పాలకొండ: డివిజన్ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది అనుక్షణం భయం గుప్పెట్లో విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని రోజులుగా కార్యాలయం లోపలికి వెళ్లేందుకు సిబ్బంది భయపడుతున్నారు. ఓ వైపు కార్యాలయంలో రోజుకో గది కూలిపోతోంది. వర్షం పడితే కార్యాలయం మొత్తం చిత్తడిగా మారుతోంది. కార్యాలయానికి వచ్చిన తహసీల్దార్లు అరకొర మెరుగులతో మరమ్మతులు చేపడుతున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చేయలేకపోతున్నారు. పట్టంలోని తహసీల్దార్ కార్యాలయం బ్రిటీష్ కాలంలో నిర్మించారు. పూర్తిగా రాయి, సున్నంతో నిర్మించిన ఈ కార్యాలయం పాత కట్టడాల ప్రావీణ్యతను తెలియజేస్తుంది. పూర్తిగా కలప, పెంకులతో నిర్మించిన ఈ కార్యాలయంలో ప్రస్తుతం సమస్యలు తాండవిస్తున్నాయి. గతంలో వర్షానికి కంప్యూటర్ గది పైకప్పు పూర్తిగా కూలిపోయింది. దీంతో అక్కడ సామగ్రి మొత్తం పాడైంది. పైకప్పు రాత్రి సమయంలో కూలడంతో ప్రమాదం జరగలేదు గాని అదే పగలు కూలిపోతే పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.



పెచ్చులు ఊడిపడుతున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ గది

అస్తవ్యస్తంగా వైరింగ్ ..

ప్రస్తుతం కార్యాలయంలో విద్యుత్ వైరింగ్ అస్తవ్యస్తంగా ఉంది. ఎన్నో ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన వైరింగ్ ప్రస్తుతం ఊడిపోయింది. వైర్లు వేలాడుతూ ఉన్నాయి. కొన్నిసార్లు కార్యాలయ గోడలు షాక్ కొడుతుండడంతో సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు.

నిధులు మంజూరు కాలేదు..

వాస్తవానికి కార్యాలయం దుస్థితిపై గతంలో సాక్షిలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో కలెక్టర్ స్పందించి మరమ్మతులకు ప్రతిపాదనలు చేయించారు. అయితే నిధులు మంజూరు కాకపోవడంతో మరమ్మతులు చేపట్టలేకపోయారు. పాత భవనాన్ని కాపాడుకుంటూనే మరమ్మతులు చేపట్టాలని అప్పటి అధికారులు ప్రయత్నించారు. అయితే అటువంటి పనులు చేసేవారు అందుబాటులో లేకపోవడంతో పనులు జరగలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేపట్టడం గాని కొత్త భవనం నిర్మాణానికి గాని చర్యలు తీసుకోవాలని అటు సిబ్బంది ఇటు ప్రజలు కోరుతున్నారు.

● శిథిలావస్థలో..

వీరఘట్టం మండలంలోని దశుమంతపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఓ భవనం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. విద్యార్థులు ఆ భవనం పరిసరాల్లోనే తిరుగుతుంటారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి భవనాన్ని తొలగించాలని కోరుతున్నారు.

– వీరఘట్టం



11 పాఠశాలల్లో ఎన్‌ఏఎస్ పరీక్ష

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని 6 ఉన్నత పాఠశాలలు, 5 ప్రాథమిక పాఠశాలల్లో 3, 6, 9 తరగతులకు చెందిన విద్యార్థులకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షను (పరఖ్ జాతీయ సర్వే) నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే అబ్జర్వర్లు, ఇన్విజిలేటర్స్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించినట్లు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. పాఠశాలలో విద్యా పురోగతిని కొలవడానికి, విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యం తెలుసుకోవడానికి ఈ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

- డీఐజీ గోపీనాథ్ జెట్టి



గరుగుబిల్లి పోలీసుస్టేషన్‌ను సందర్శించిన డీఐజీ

గరుగుబిల్లి: గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ పనితీరును పార్వతీపురం మన్యం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎస్పీ మాధవరెడ్డితో కలసి బుధవారం పరిశీలించారు. ఇందులో భాగంగా రికార్డు రూం, కంప్యూటర్ రూం, ప్రోపర్టీ భద్రపరిచే రూంలను పరిశీలించారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ సైబర్ నేరాలు రోజు రోజుకు ఎక్కువగా నమోదవుతున్నాయని, దీని నుంచి ప్రజలను రక్షించాలంటే పోలీసు వ్యవస్థ ఎప్పటికప్పుడు పై చేయి సాధించేలా సంసిద్ధంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ నేరగాళ్లు రోజురోజుకు నేరాల స్వభావాన్ని మారుస్తూ మోసాలు చేస్తున్నారన్నారు. దీన్ని నివారించాలంటే ప్రజలకు మరింత అవగాహన వుండాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు సంకల్పం కార్యక్రమంతో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాలకొండ డీఎస్పీ పి.రాంబాబు, చినమేరంగి సీఐ టీవీ తిరుపతిరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ రంగనాధం, ఎస్‌ఐ పి.రమేష్ నాయుడు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు

జియ్యమ్మవలస: విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి అన్నారు. చినమేరంగి సర్కిల్ పోలీస్‌స్టేషన్ వద్ద కళాశాల విద్యార్థులతో సంకల్పం కార్యక్రమంలో భాగంగా బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల జోలికి పోకుండా ధైర్యంగా పోరాడాలన్నారు. విద్యార్థి స్థాయి నుంచే గంజాయి, మత్తు పదార్థాల జోలికి పోకుండా ఉండాలన్నారు. చిన్నపాటి తప్పిదం కుటుంబాన్నే నాశనం చేస్తుందన్నారు. యువత రేపటి సమాజానికి బంగారు బాట వేసిన వారవుతారన్నారు. మంచి జీవితాన్ని అనుభవించే విద్యార్థులుగా పేరు తెచ్చుకోవాలన్నారు. ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోయాయని, అటువంటివి జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందివ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐలు టీవీ తిరుపతిరావు, బి.హరి, ఎస్‌ఐ అనిష్ పాల్గొన్నారు.

పరఖ్ పరీక్షల పరిశీలన



బర్లి యూపీ పాఠశాలలో పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ

బలిజిపేట: మండలంలో నిర్వహిస్తున్న పరఖ్ పరీక్షలను ఎంఈఓ–2 కె.శ్రీనివాసరావు బుధవారం పర్యవేక్షించారు. మండలంలో బర్లి యూపీ, బలిజిపేట, వంతరాం ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షలను ఆయన పరిశీలించారు. విద్యార్థులలో సామర్థ్యాలను వెలికితీసేందుకు ఈ పరీక్షలు దోహదపడతాయని తెలిపారు. 3, 6, 9 తరగతులకు చెందిన విద్యార్థులలో 30మంది విద్యార్థుల వంతున పరీక్షకు ఎంపికచేసి వారికి నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం



మంటలు అదుపు చేస్తున్న అగ్ని మాపక సిబ్బంది

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండలం తాళ్లబురిడి గ్రామంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివాములు దగ్ధమయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. బలగ శంకరరావుకు చెందిన నాలుగు ఎకరాల పంటకు సంబంధించి గడ్డి వాములు దగ్ధమైనట్టు తెలిసింది.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారి

పాలకొండ రూరల్: అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని స్థానిక అగ్నిమాపక శాఖాధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. మండలంలోని బాసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ప్రమాదాలు జరిగినప్పుడు చేపట్టాల్సిన నష్ట నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.

● పొలాల్లో ధాన్యం...రైతుల కళ్లల్లో దైన్యం



బూరుగ వద్ద పొలంలోనే తడిచిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



చలివేంద్రిలో ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళ

తుఫాన్ ప్రభావంతో వారం రోజులుగా కురిసిన వర్షాలకు పొలాల్లోని వరి కుప్పలతో పాటు నూర్పులు చేపట్టిన ధాన్యం తడిచిపోవడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. బుధవారం వాతావరణం కొద్దిగా మారడంతో పొలాల్లో ధాన్యాన్ని ఎండబెట్టే పనిలో పడ్డారు. తడిచిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

– వీరఘట్టం

● దాడులు తగవు..



బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు కోరారు. ఈ మేరకు దాడులను ఖండిస్తూ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. వీహెచ్‌పీ సభ్యులు పాల్గొన్నారు.

-పాలకొండ

● పరామర్శ ..



సీతంపేట మండలంలోని పెద్దూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నిమ్మక సత్తెమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొండగొర్రి భాస్కరరావు, హిమరక మోహనరావు, పెదరామ, శంభాం, పెద్దూరు సర్పంచ్‌లు బిడ్డిక తిరుపతిరావు, నిమ్మక తిరుపతిరావు, హెచ్.ఆదిలక్ష్మి, గ్రామ పెద్దలు ఆరిక రాములు, రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

- సీతంపేట

జాగ్రత్తలు తప్పనిసరి



బొడ్డగూడలో పత్తి రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు

భామిని: పత్తి సేకరించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సీతంపేట ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని బొడ్డగూడ, చినమూలగూడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ కె.సింహాచలం, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు మాట్లాడుతూ... ప్రస్తుత శీతాకాల సీజన్‌లో పత్తి సేకరణ, నిల్వల్లో చేపట్టాల్సిన మెలకువలు వివరించారు. చిరుధాన్యాల సేద్యం, వాటి ఆవశ్యకత, ఆర్థికపరమైన లాభాలపై అవగాహన కల్పించారు. పంట సంజీవిని వల్ల కలిగే ప్రయోజనాలు, తక్కువ కాలపరిమితి గల వంగడాల సాగుపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉద్యానవన, ప్రకృతి వ్యవసాయాధికారులు ఎర్రన్న, పకీరు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



మరిపల్లిలో వృద్ధులలకు దుప్పట్లు అందజేస్తున్న యస్ సొసైటీ కార్యదర్శి గౌష్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని ఏగులవాడ పంచాయతీ మరిపల్లి, బియ్యాలవలస పంచాయతీ మర్రిగూడ గ్రామాల్లోని అనాథలు, వృద్ధులకు బుధవారం యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంకు చెందిన గుండె వైద్య నిపుణులు ప్రసాద్‌లాల్‌తో పాటు కొంతమంది దాతలు చేసిన ఆర్థిక సాయంతో వృద్ధులు, అనాథలు ఈ చలికాలంలో కాస్త ఉపశమనం పొందేలా దుప్పట్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. మర్రిగూడ గ్రామంలో చేపట్టిన కార్యక్రమంలో కురుపాం ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి పాల్గొని వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పువ్వల కైలాస్, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అపరాల సాగుపై దృష్టి సారించాలి



వంజరాపుగూడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

గుమ్మలక్ష్మీపురం: రబీలో అపరాల పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని కురుపాం ఏడీఏ ఎ.నిర్మలా జ్యోతి అన్నారు. ఏఓ సీహెచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని వంజరాపుగూడ గ్రామంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ రబీలో మినుములు, పెసలు, ఉలవలు, నువ్వులు, రాగి, వేరుశనగ వంటివి ప్రధాన పంటలుగా అందులో అంతర పంటలుగా జొన్న, బెండ, గోంగూర, తోటకూర, ఆవాలు,చిక్కుడు, ఆముదం వంటివి సాగు చేసుకుంటే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే జీడిమామిడి ప్రోసెసింగ్ యూనిట్లు అందుబాటులో ఉన్న సబ్సిడీ వ్యవసాయ పరికరాలపై అవగాహన కల్పించారు.

యంత్రాలతో రైతులకు ఊరట

- సమయం ఆదా.. తగ్గుతున్న వ్యయం



బివి.పురంలో వరి పంటను నూర్చుతున్న రైతులు

గరుగుబిల్లి: రైతాంగాన్ని ప్రస్తుతం కూలీల కొరత వేధిస్తుంది. విత్తనం వేయాలన్నా...కలుపు తీయాలన్నా...కోత కోయాలన్నా.....నూర్పిడి చేయాలన్నా....కూలీలు కావల్సిందే. కానీ మారుతున్న పరిస్థితులకు తగ్గట్టుగా అందుబాటులో వస్తున్న యంత్రాలతో రైతులకు కొంత ఊరట కలుగుతోంది. వరి కోత, పంటనూర్పిడి యంత్రాలు అందుబాటులోకి రావడంతో కూలీల సమస్య తీర్చడంతో పాటు డబ్బులు కూడా ఆదా అవుతుంది. కొంతకాలం క్రితం అక్కడక్కడా ఒకటో, రెండో ఉన్న వరికోత యంత్రాలు వుండేవి. ప్రస్తుతం ప్రతీ గ్రామంలో రెండు నుంచి నాలుగు వరకు నూర్పిడి యంత్రాలున్నాయి. ఎకరా వరికోత కోయాలంటే కనీసం పది మంది కూలీలు కావాలి. కోసేందుకు, కుప్పలు నూర్చేందుకు కూలీలకు రవాణాకు రూ.8 వేలు వరకు ఖర్చు అవుతుంది. కానీ ఇప్పుడు రూ.4వేల నుండి రూ.5వేల వరకు ఖర్చువుతుంది. దీంతో సగానికి పైగా రైతులకు ఆదా అవుతుంది. మొదట్లో యంత్రం కొనుగోలు చేసేందుకు అధిక వ్యయమైనా స్వల్పవడ్డీ వాయిదాల పద్ధతిలో యంత్రాలను పలు సంస్థలు, ప్రభుత్వం సబ్సిడీపై యంత్రాలను అందించడంతో రైతులు కొనుగోలు చేసుకొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. పంటపొలాలు అదునుగా వుండటంతో పాటు, వాతావరణం అనుకూలిస్తే పంట ఖర్చులు మరింత తగ్గుతాయి. యంత్రాల వినియోగం పెరగడంతో కూలీలకు పనిదినాలు కూడా తగ్గే అవకాశం లేకపోలేదు. ఏదిఏమైనా యంత్రాల వినియోగంవల్ల రైతులు ఎంతో లబ్ధి పొందుతున్నారని చెప్పవచ్చు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో వరి పంట పనులను చురుకుగా చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నారు.